
విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న రవీందర్‌ముదిరాజ్

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలి

షాపూర్‌నగర్, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల అధికారులు, ప్రజాప్రతినిధులు, కులసంఘాల సభ్యులు, కాలనీ, బస్తీల అసోసియేషన్ సభ్యులు కృషి చేయాలని పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్‌ముదిరాజ్ అన్నారు. మంగళవారం సూరారం డివిజన్ నార్త్ సిటీ స్కూల్ విద్యార్థులకు ఓటింగ్ శాతం పెంచడంపై అవగాహన కల్పించారు. ఓటు విలువను గుర్తించి, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.


పార్టీలో చేరిన వారితో కిషన్‌రెడ్డి

బీజేపీలో చేరిన కౌసల్య కాలనీవాసులు

నిజాంపేట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ 17వ డివిజన్ కౌసల్య కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సలహాదారులు నారాయణమూర్తి, 1వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావుల ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం చేరారు. వీరందరికి కిషన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యావంతులు, ఐటీ ఉద్యోగులు, కాలనీ సంక్షేమం కోసం పాటు పడే వ్యక్తులు పార్టీలో చేరడం శుభపరిణామం అన్నారు. కౌసల్యకాలనీ అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సెక్రటరీ కొల్లి మాధవి, కుత్బుల్లాపూర్ కన్వీనర్ మల్లారెడ్డి, ఉదయ్‌కిరణ్, ప్రసాద్, ప్రసాద్‌రాజు ఉన్నారు.


కాసాని నామినేషన్‌కు తరలిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

చేవెళ్లలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తాం

మియాపూర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ కార్యక్రమంలో ఆయనకు మద్దతుగా రాజేంద్రనగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ బీసీ వర్గానికి పెద్దపీట వేసి జ్ఞానేశ్వర్‌ను ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, హమీద్‌పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, సింధురెడ్డి, రోజాదేవి, మంజులారెడ్డి పాల్గొన్నారు.

కాసాని నామినేషన్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

వివేకానందనగర్‌కాలనీ: కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు తరలివెళ్లారు.


ఆల్విన్‌కాలనీలో విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న రవికుమార్‌యాదవ్

అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యం

హైదర్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత పాలన, అభివృద్ధి, సంక్షేమ బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని, దీని కోసం బీజేపీకి ఓటువేసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలిపించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్టీఆర్‌నగర్, మొగులమ్మబస్తీ, పీజేఆర్‌నగర్, గణేష్‌నగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, సిక్కులబస్తీ, అంబేద్కర్‌నగర్, జన్మభూమికాలనీ, మహాత్మాగాంధీనగర్ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి కరపత్రాలు అందించి బీజేపీకే ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవీంద్రరావు, మణిభూషణ్, నరేందర్‌రెడ్డి, రామరాజు, కమలాకర్‌రెడ్డి, నర్సింగ్‌యాదవ్, నరసింహచారి, కుమార్‌యాదవ్, కేశవ్, స్రవంతి, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.


కేపీహెచ్‌బీకాలనీలో పాదయాత్ర చేస్తున్న సునీతారెడ్డి, బండి రమేష్

మల్కాజిగిరిలో కాంగ్రెస్ విజయం ఖాయం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం కేపీహెచ్‌బీకాలనీలో నిర్వహించిన పాదయాత్రలో ఆమె పాల్గొని మాట్లాడారు. మల్కాజిగిరి ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమంలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వివరించారు. నిత్యం ప్రజలతో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలంటే రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ సీట్లను అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు గ్యారెంటీలతో పాటు కేంద్రంలో ప్రవేశపెట్టబోయే న్యాయ పతకాలు కూడా రాష్ట్ర ప్రజలకు అందుతాయని తెలపారు. నాయకులు ఇంటింటికీ తిరుగుతూ పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి, నాయకులు సత్యం శ్రీరంగం, తూము వేణు, శేరి సతీష్‌రెడ్డి, కృష్ణరాజ్‌పుత్, సాధు ప్రతాప్‌రెడ్డి, మేకల మైఖేల్, ఫణికుమార్, పొడుగు అప్పారావు, అరవింద్‌రెడ్డి, నయీం, రేష్మ, సంధ్య, మారుతి, వనజ, నాగమణి, వాణి పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్-1లోని శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆయల వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేఎం.గౌరీష్, ఆలయ కమిటీ సభ్యులు వినోద్‌కుమార్, సత్తిరెడ్డి, గురుబ్రహ్మం, రంగసుబ్బయ్య, సుధాకర్, బ్రహ్మం, ముత్యాలు, విజయ్, శంకరయ్య, కృష్ణ పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న వివేకానంద్

ఘనంగా హనుమాన్ జయంతి

జోన్‌బృందం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి)

హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కూకట్‌పల్లి, బాలాజీనగర్, కేపీహెచ్‌బీ కాలనీ, సప్తగిరికాలనీ, వీవీనగర్, మూసాపేట ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీ, నిజాంపేట్ కార్పొరేషన్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఆయా పూజా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. మూసాపేటలోని రామదండు ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర ప్రశాంతంగా జరిగింది.


కూకట్‌పల్లి 127వ డివిజన్‌లో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్


బాగ్‌అమీర్‌లోని ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ రంగారావు


వీవీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆకుపూజ


నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని హనుమాన్ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో 33వ డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు


కుత్బుల్లాపూర్ జగద్గిరిగుట్టలోని హిందూ సంఘాలతో వేడుకలు జరుపుకుంటున్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి


సప్తగిరికాలనీలోని రామాలయ ప్రాంగణంలో ఉన్న భారీ హనుమాన్ విగ్రహానికి వేయి వడలతో రూపొందించిన దండ


చందానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, జగదీశ్వర్‌గౌడ్, రఘునందన్‌రెడ్డి


ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసీవనంలో విజిత్‌వర్మ ఆధ్వర్యంలో హనుమాన్ శోభయాత్రలో పాల్గొన్న బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోడలు రిషికారెడ్డి

రేపటి నుంచి పరుచూరి రఘుబాబు స్మారక నాటక పోటీలు

రవీంద్రభారతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయస్థాయి నాటక, నాటికల పోటీలు ఈ నెల 25 నుంచి 27 వరకు రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు రాత (నాటిక), జేబు చెప్పిన ఊసులు, రైతేరాజు, బూడిద, నాటికలు ప్రదర్శించనున్నారు. రెండో రోజు విజ్ఞాన భారతం, అమృతహస్తం, భూగోళం, దారణం నాటికలు, మూడో రోజు జైజవాన్, జైకిసాన్, అనూహ్యం, కపిరాజు, కాపలా, నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలను ప్రదర్శించనున్నారు. ఈ నాటకోత్సవాలకు ప్రముఖనటుడు మురళీమోహన్, ఆర్.నారాయణమూర్తి, బి.గోపాల్, జీవితరాజశేఖర్, యండమూరి, వీఎన్.ఆదిత్య పాల్గొంటారని పరుచూరి సోదరులు ఒక ప్రకటనలో తెలిపారు.


విజయనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

విజయనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

హైదర్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ విజయనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ అడ్వైజర్స్‌గా రామజోగేశ్వరరావు, బ్రహ్మాచారి, అధ్యక్షుడిగా బి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా మురళీ కృష్ణమోహన్, జనరల్ సెక్రటరీగా స్వరూప, ఆర్గనైజింగ్ సెక్రటరీగా హన్మంతరావు, ట్రెజరర్‌గా ఎంఎస్ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా చంద్రశేఖర్, శ్రీధర్, కిషోర్, మెంబర్స్‌ను ఎన్నుకున్నారు.

మెకానిక్ షెడ్డులో స్వల్ప అగ్ని ప్రమాదం

దుండిగల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లిలోని ఓ మెకానిక్ షెడ్డులో మంగళవారం స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. మెకానిక్ షెడ్డు యజమాని ఖదీర్ వివరాల ప్రకారం మెకానిక్ షెడ్డులో వెల్డింగ్ పని చేస్తుండగా నిప్పు రవ్వలు పడి రెగ్జిన్‌కు మంటలంటుకున్నాయి. ఈ ప్రమాదంలో డీసీఎం, మినీబస్సు కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు.

అక్రమ షట్టర్లను కూల్చివేసిన అధికారులు

దుండిగల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్‌లోని సాయి బాలాజీకాలనీలో అనుమతులు లేకుండా వెలసిన ఎనిమిది షట్టర్లలో ఐదింటిని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షట్టర్ల పనులను నిలిపివేయాలని అధికారులు నోటీసులిచ్చినా పట్టించుకోవడం లేదు. ఈ విషయం దుండిగల్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి రావడంతో షట్టర్లను ధ్వంసం చేయించారు. మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేసి కేసులు నమోదు చేయిస్తామని కమిషనర్ హెచ్చరించారు.


అనుమతులు లేకుండా నిర్మించిన షట్టర్లు

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మంగళారపు లక్ష్మణ్

గచ్చిబౌలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): థర్మల్ పవర్, కార్బోహైడ్రేట్స్, ఏసీలు, ఓవెన్లు, రిఫ్రిజిరేటర్ల వాడకం అధికం కావడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని రచయిత, సీనియర్ జర్నలిస్ట్, సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించాలనే అంశాలపై మంగళవారం విద్యార్థులతో కలిసి కొండాపూర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్‌తో వాతావరణం వేడెక్కడం వల్ల ఓజోన్ పొర కరిగిపోతోందన్నారు. అందరూ పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సంస్కృతి హైస్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కేసును తప్పు దోవ పట్టించిన ఎస్ఐ సస్పెన్షన్

గాజులరామారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసును ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నించిన ఎస్సైని ఉన్నతాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. జనవరిలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గుడి పక్కన నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ హత్యకు గురయింది. ఆ ఘటనపై గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లుగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే సూరారం స్టేషనులో అడ్మిన్ ఎస్సైగా ఉన్న నారాయణసింగ్ ఈ కేసును ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేయడంతో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు.


నారాయణసింగ్

మీ డబ్బులు మాకొద్దు బాబోయ్..!

కళాశాలల యాజమానులతో ఎఫ్ఎఫ్‌సీ అధికారులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ) తనిఖీల వ్యవహారం కొత్తమలుపు తిరిగింది. మొన్నటి వరకు తనిఖీల కోసం ప్రైవేట్ కాలేజీలకు వెళ్లిన కొందరు జేఎన్టీయూ అధికారులు పెద్దమొత్తంలో ముడుపులు డిమాండ్ చేశారు. తాజాగా "మీ డబ్బులు మాకొద్దు బాబోయ్" అంటూ.. ఆయా కాలేజీల యాజమాన్యాలకు ఓ నమస్కారం పెట్టి వెనుదిరుగుతున్నారు. ఈ మార్పు చూసి జేఎన్టీయూ ఉన్నతాధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. తనిఖీల సమయంలో సొమ్ము తీసుకోకుండా నిలువరించిన జేఎన్టీయూ ఉన్నతాధికారులు అఫిలియేషన్ ఇచ్చేటప్పుడు కూడా ఇదే పద్ధతిని పాటిస్తారో, లేదోనని కాలేజీల యాజమాన్యాలు సందేహం వ్యక్తం చేస్తున్నాయి. కాగా, తనిఖీ అధికారులపై ఎన్నికల అధికారులు కూడా నిఘా పెట్టారు.

బెల్ట్ దుకాణంపై పోలీసుల దాడి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మూసాపేటలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఓ బెల్ట్ దుకాణంపై మంగళవారం కూకట్‌పల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేటకు చెందిన తులసీరామ్(50) స్థానిక గూడ్‌షెడ్ రోడ్డులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. అందులో మద్యం, కల్లు సీసాలను విక్రయిస్తున్నాడు. హనుమాన్ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి పోలీసులు తనిఖీలు నిర్వహించగా.. అక్రమ మద్యం వ్యాపారం వెలుగుచూసింది. వెంటనే తులసీరామ్‌ను అదుపులోకి తీసుకొన్న పోలీసులు అతడి నుంచి రూ.లక్ష విలువైన 34 మద్యం సీసాలతో పాటు 46 కల్లు సీసాలను స్వాధీనం చేసుకొన్నారు.

తిరుమల ఘాట్‌లో ఆగిన కారును ఢీకొన్న బస్సు

- స్వల్పగాయాలతో బయటపడిన హైదరాబాద్ భక్తులు

తిరుమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో ఆగి ఉన్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం కారు(ఏపీ 39 డీజే 2708)లో మంగళవారం మధ్యాహ్నం అలిపిరి వద్ద తనిఖీలు పూర్తి కాగానే తిరుమలకు బయలుదేరారు. వినాయక ఆలయం దాటిన తర్వాత ఓ మలుపు వద్ద సాంకేతిక సమస్యతో కారు నిలిచిపోయింది. ఆ సమయంలోనే వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు(ఏపీ 03 జెడ్ 0187) కారును ఢీకొంది. దీంతో కారు రోడ్డుపై నుంచి ముందుకు దూసుకువెళ్లింది. కారులోని ఆరుగురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు వెనక భాగం ధ్వంసమైంది. మరోవైపు ఆర్టీసీ బస్సు ముందు అద్దం పగిలిపోవడంతోపాటు ముందుభాగం స్వల్పంగా దెబ్బతిన్నది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి గురైన కారు

ప్రశాంతినగర్‌వాసులతో కార్పొరేటర్ సమావేశం


సమావేశంలో కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ ప్రశాంతినగర్ కాలనీవాసులతో మంగళవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సమావేశమయ్యారు. బీఆర్ఎస్ హయాంలో కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్, శ్రీధర్‌రెడ్డి, బొట్టు విష్ణు, బి.డి.రామారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

- బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్న సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు.

లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

షాపూర్‌నగర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం సూరారం డివిజన్ నెహ్రూనగర్‌లో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు హేమలతారెడ్డి, సుభద్రారెడ్డి, ధనలక్ష్మి, అరుణ, సిద్దిక్, మధు పాల్గొన్నారు.

రేపటి నుంచి మే 2 వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి మే 2 వరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విభాగాలకు చెందిన పరీక్షలుంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆమె సూచించారు.

తేదీ	ఇంటర్(ఉదయం)	మధ్యాహ్నం	ఎస్ఎస్‌సీ (ఉదయం)	మధ్యాహ్నం
25-04-2024	తెలుగు/ఉర్దూ/హిందీ	అరబిక్	తెలుగు/కన్నడ/తమిళ్/మరాఠీ	సైకాలజీ
26-04-2024	ఇంగ్లీష్	సోషియాలజీ	ఇంగ్లీష్	ఇండియన్ కల్చర్, హెరిటేజ్
27-04-2024	పొలిటికల్ సైన్స్	కెమిస్ట్రీ/పెయింటింగ్	మ్యాథమెటిక్స్	బిజినెస్ స్టడీస్
29-04-2024	కామర్స్/బిజినెస్ స్టడీస్	ఫిజిక్స్/సైకాలజీ	సైన్స్ అండ్ టెక్నాలజీ	హిందీ
30-04-2024	హిస్టరీ	మ్యాథమెటిక్స్/జాగ్రఫీ	సోషల్ స్టడీస్	ఉర్దూ
01-05-2024	ఎకానామిక్స్/ మాస్‌కమ్యూనికేషన్స్	బయాలజీ/అకౌంటెన్సీ /హోమ్ సైన్స్	ఎకనామిక్స్	హోంసైన్స్
02-05-2024	ఆల్ ఒకేషనల్ సబ్జెక్ట్స్(థియరీ)	========	ఆల్ ఒకేషనల్ సబ్జెక్ట్స్ (థియరీ)	ఆల్ ఒకేషనల్ సబ్జెక్ట్స్ (ప్రాక్టికల్స్)

ఆటో అద్దె డబ్బులు అడిగినందుకు హత్య

- కోహీర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితులు

కోహీర్ ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మండల కేంద్రం కోహీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన షేక్ అన్వర్ అలీ(30) సోమవారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. కోహీర్ పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు.. కోహీర్ మండలంలోని రాజనెల్లి గ్రామానికి చెందిన ముస్తకీమ్, గురుజువాడ గ్రామానికి చెందిన మహ్మద్ కైఫ్‌లు హైదరాబాద్ ఉండే అన్వర్‌అలీ వద్ద ఆటోను అద్దెకు తీసుకొని నడుపుతుంటారు. అయితే అన్వర్‌అలీకి ఇవ్వాల్సిన ఆటో అద్దె డబ్బులు ఇవ్వకుండా ముస్తకీమ్, మహ్మద్ కైఫ్‌లు హైదరాబాదు నుంచి తమ స్వగ్రామాలకు వచ్చారు. తనకు అద్దె డబ్బులు ఇవ్వాలని అన్వర్‌అలీ తరుచు ఫోన్ చేస్తూ ఒత్తిడి చేయడంతో అన్వర్‌అలీని ఎలాగైనా హత్య చేయాలని ముస్తకీమ్, మహ్మద్‌కైఫ్‌లు భావించారు. సోమవారం మధ్యాహ్నం అన్వర్ అలీ డబ్బుల కోసం ఫోన్ చేయడంతో డబ్బులు ఇస్తామని చెప్పి అతడిని కోహీర్‌కు రమ్మన్నారు. దీంతో అతడు సోమవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో కోహీర్‌కు వచ్చాడు. వీరు ముగ్గురు కలిసి కోహీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక భాగంలో మద్యం సేవించారు. అక్కడ మద్యం సేవించిన తర్వాత డబ్బుల విషయమై వీరి మధ్య గొడవ జరిగింది. తమ వెంట తెచ్చుకున్న కత్తితో అన్వర్ అలీపై దాడి చేశారు. ఈ దాడిలో మొదట ముస్తకీమ్ చాతిపై కత్తి ఘాటు పడింది. దీంతో ముస్తకిం, మహమ్మద్ కైఫ్‌లు ప్రతిఘటించి అదే కత్తితో అన్వర్‌అలీపై దాడి చేశారు. దీంతో అన్వర్‌అలీ అక్కడికక్కడే మృతి చెందాడు. చనిపోయాడని వీరిద్దరూ నిర్ధారించుకొని కోహీర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. మంగళవారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న జహీరాబాద్ సీఐ రవి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా వీరు ముగ్గురు కలిసి దొంగతనాలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అన్వర్‌అలీపైన నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌లో 11 చోరీ కేసులు కూడా ఉన్నట్లు తెలిపారు. ముస్తకీమ్, మహ్మద్ కైఫ్‌లు కూడా పలు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు.


హత్యకు గురైన అన్వర్‌అలీ


సిటీలో ఆకార్డియన్ టెక్నాలజీస్ కార్యాలయం

ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు


ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రవీంద్రభారతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): యూకెకు చెందిన ప్రముఖ సంస్థ ఆకార్డియన్ టెక్నాలజీస్ కార్యాలయాన్ని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హైటెక్‌సిటీలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబుకు సంస్థ చేస్తున్న కార్యక్రమాల గురించి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభల శ్రీనివాస్ వివరించారు. ఇప్పటికే 80 మంది సిబ్బందితో ఎంతోమందికి తమ సేవలు అందుబాటులో ఉన్నాయని, భవిష్యత్తులో మరో 100 మంది సిబ్బందిని నియమిస్తామని తెలిపారు.

● బీజేపీలో చేరిక



కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎంఎస్ వాసు మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో కిషన్‌రెడ్డి కార్యాలయంలో బీజేపీలో చేరారు.

- జీడిమెట్ల, ఆంధ్రజ్యోతి